
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

3

శుక్రవారం 28 నవంబరు 2025



బుగ్గవంక పరివాహక ప్రాంతంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

టీవీ విలేకరి వేధిస్తున్నాడు

- ఎమ్మెల్యేకు బాధితురాలి ఫిర్యాదు

కమలాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రగుడిపాడు గ్రామానికి చెందిన ఓ టీవీ విలేకరి (ఆంధ్రజ్యోతి కాదు) కొన్ని సంవత్సరాలుగా తనను వేధిస్తున్నాడని అంగన్వాడీ ఆయా గురువారం ఎమ్మెల్యే పుత్రా క్రిష్ణచైతన్యరెడ్డి నిర్వహించిన ప్రజాదర్బారులో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ అతను ఓ టీవీ చానెల్‌లో పనిచేస్తూ తనను మానసికంగా వేధిస్తున్నాడని, అనవసరంగా సెంటరుకు వచ్చి ఫొటోలు తీస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని అన్నారు. గతంలో అతన్ని మందలించినా మారడంలేదని, కేసులు కూడా నమోదయ్యాయని అన్నారు. ఇప్పటికైనా అతడి బారినుంచి కాపాడాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఆ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. పోలీసులు తప్పకుండా చర్యలు తీసుకుంటారని ఆమెకు భరోసా ఇచ్చారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అందించే ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఎం.అంజల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ విభాగాలకు చెందిన అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 30లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. డిసెంబరు 5న స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో బీసీలు 66 శాతం, ఎస్సీలు 20శాతం, ఎస్టీలు 14 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక అవుతారని, వారికి విజయవాడలోని గొల్లపూడిలో గల బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. సివల్స్ ప్రిలిమినరీ మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులలిస్టులు, కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్కు, రెండుపాస్‌పోర్టు సైజ్ ఫోటోలు జతపరిచి నేరుగా కడప పాత రిమ్స్‌లోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్, బీసీభవన్‌లో అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9703185382, 9849919221 నెంబర్లకు ఫోను చేసి సంప్రదించాలని తెలిపారు.

కొనసాగుతున్న డ్రోన్ నిఘా

కడప క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠినచర్యలకు పోలీసు అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. గురువారం కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం చేసే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా చర్యలు చేపట్టారు. కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో, స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టారు. అనుమానిత ప్రాంతాల నుంచి పారిపోయిన నిందితులను డ్రోన్‌కెమెరాల ద్వారా గుర్తించి వారిని పట్టుకుని కౌన్సెలింగ్‌తో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని బుగ్గవంక పరివాహక ప్రాంతం, గుర్రాల గడ్డ, పాతబస్టాండు ఓల్డ్ రిమ్స్ పరిసరాల్లో, పాత భవనాలు ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.

పోలీసుల చర్యలకు డీఎస్పీదే బాధ్యత

- కిడ్నాప్ కథ నడిపిన వసంత్‌ను అరెస్టు చేయాలి
- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగారు వ్యాపారులు తనికంటి శ్రీనివాస్, వెంకటస్వామిలను కిడ్నాప్ చేసి వారిని చిత్ర హింసలకు గురిచేయడంతో పాటు కోట్ల విలువైన ఆస్తిపత్రాలు తీసుకెళ్లిన పోలీసుల హింసాత్మక చర్యలకు ప్రొద్దుటూరు డీఎస్పీ భావనదే పూర్తి బాధ్యత అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విజయవాడ ఏఎస్పీ అని చెప్పి కిడ్నాప్ కథను దగ్గరుండి నడిపి తుపాకి గురిపెట్టి బెదిరించిన వసంత్ ఎవరో డీఎస్పీనే వెల్లడించి అతడిని అరెస్టు చేయాలన్నారు. త్రీటౌన్‌లో కేసు నమోదు అయితే ఒన్‌టౌన్‌కు కేసు మార్చడం, ఒన్‌టౌన్ సీఐ నేతృత్వంలో ఈ నేరాలు చేయించడంలో ఎవరి హస్తముందో తేల్చాలన్నారు. ఈ నేరంలో పాల్గొన్న ఇతర ఎస్ఐలు, పోలీసులపై కూడా కేసు పెట్టాలన్నారు. దీన్ని ఇక్కడితో వదిలిపెట్టేది లేదని డీజీపీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. ఇక మీదట ప్రొద్దుటూరులో ఏ వ్యాపారికి పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదురైనా తనకు ఫోన్ చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ వద్ది బాలుడు పాల్గొన్నారు.

వేగవంతంగా ఓటర్ మ్యాపింగ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2025 కార్యక్రమాల్లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ వేగవంతంగా జరుగుతోందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. గురువారం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఈఆర్వోలు, బీఎల్వోల నియమాకం, బీఎల్వోల ఐడీ కార్డుల పంపిణీ, కొత్తపోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జేసీ మాట్లాడుతూ ఎస్ఐఆర్-2025 ప్రకారం జిల్లాలోని 16,48,315 మంది ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా 3,34154 మందికి మ్యాపింగ్ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 1963 బీఎల్వోలు వివరాలను అప్డేట్ చేసి విధులను కేటాయించి 1874 మందికి కార్డులు పంపిణీ చేశామన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులకు అందిన మొత్తం 32,382 అభ్యంతరాలలో 24,716 క్లియర్ చేశామని 6,920 తిరస్కరించగా 174 వివిధ కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,963 పోలింగ్ కేంద్రాలు ఉండగా రేషనలైజేషన్ తరువాత 2,121కు చేరుకున్నాయన్నారు. 158 కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు, ఎన్నికల అధికారులు హాజరయ్యారు.

జీఎస్టీకి మస్కా

- దుకాణాల్లో కానరాని తగ్గింపు ధరలు
- పాత ధరలకే అమ్మకాలు
- ఆకస్మిక తనిఖీలు, విజిలెన్స్ దాడులు శూన్యం
- పేదలకందని జీఎస్టీ తగ్గింపు ఫలాలు

కడప కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపార సముదాయాలు, పరిశ్రమలు, వస్తు ఉత్పత్తుల నుంచి స్టేట్, సెంట్రల్ ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఏటా దాదాపు రూ.2 వేల కోట్ల వరకు చెల్లింపులు జరుగుతున్నాయి. అందులో సగం గూడ్స్ సర్వీసు టాక్సుల (జీఎస్టీ) కింద రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా నుంచి 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రూ.909.12 కోట్లు పన్నుల రూపంలో చేరాయి. గతేడాది రాబడిని పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది మరో 30 శాతం పెంపుతో 2025-26 జీఎస్టీ టార్గెట్ రూ.1108.42 కోట్లు విధించారు. ఈ టార్గెట్‌కు సంబంధించి అక్టోబరు నాటికే 50 శాతం వరకు అధికారులు వసూళ్లు చేశారు. అయితే స్టేట్, సెంట్రల్ టాక్సుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజలకు మేలు చేసే జీఎస్టీ తగ్గింపు విషయంలో అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే విమర్శలున్నాయి. రెండు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌ను పాటించక రిటైల్ మార్కెట్ వ్యాపారులు పాత ధరలతో ప్రజలను మస్కా కొడుతున్నారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు ప్రతి కుటుంబానికి తగ్గిన జీఎస్టీ ఫలాలు ఆశించిన స్థాయిలో దక్కడం లేదనే విమర్శలున్నాయి.

దిగొచ్చిన జీఎస్టీపై కొరవడిన నిఘా

2017లో జీఎస్టీ సంస్కరణలు దేశవ్యాప్తంగా అమలు చేశారు. నాలుగు శ్లాబుల్లో 5, 12, 18, 40 శాతం పన్నులతో ప్రజలు, వ్యాపార రంగాలపై భారం మోపారు. దాదాపు 9 ఏళ్ల పాటు జీఎస్టీ భారం తప్పలేదు. అన్ని వర్గాల్లో పన్నుల భారం చర్చానీయాంశం అయింది. దీంతో దిగొచ్చిన కేంద్రం ఈ ఏడాది సెప్టెంబరు నుంచి ప్రజలకు మేలు చేసే చర్యల్లో భాగంగా ఒక్కసారిగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2.0 సంస్కరణలు తెచ్చింది. ఊహించని విధంగా 438 రకాల వస్తు ఉత్పత్తులు, ఆహార వస్తువుల మొదలు విద్య, వైద్యం, ఎలక్ట్రానిక్, పరిశ్రమలు లాంటి అన్ని రంగాలలో పన్నుల భారాన్ని భారీగా తగ్గించారు. 3 శ్లాబుల్లో 5, 12, 18 శాతాలకు కుదించడంతో మన రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల ఆర్థిక భారాన్ని కూటమి సర్కారు భరిస్తోంది. ఈ లెక్కన జిల్లా ప్రజలకు జీఎస్టీ దాదాపు రూ.300 కోట్ల మేర తగ్గనున్నట్లు అధికారులు లెక్కలు కడుతున్నారు. అయితే ఇప్పటికీ పాత ధరలతో పన్నుల మినహాయింపులు లేకుండా రిటైల్ వ్యాపారులు దోచుకుంటున్నారు. వీరిపై జిల్లాలో ఎక్కడా జీఎస్టీ అధికారులు, విజిలెన్స్ దాడులు లేవు.



జిల్లా జీఎస్టీ కార్యాలయం

ధరల తగ్గింపు బోర్డులేవీ?

జీఎస్టీ ధరల తగ్గింపులకు సంబంధించిన బోర్డులు ఏ వ్యాపార సముదాయాల వద్ద ప్రదర్శించడం లేదు. పాత స్టాక్ అంటూ వ్యాపారులు పన్నుల మినహాయింపుపై బుకాయింపులకు దిగుతున్నారు. దీంతో ప్రజలకు చేరాల్సిన జీఎస్టీ ఫలాలు రిటైలర్ల జేబుల్లోకి చేరుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించి వాడే వాటిపై మొన్నటి వరకు 5, 12, 18 శాతాలున్న జీఎస్టీని అవసరాన్ని బట్టి 0 శాతం వరకు తగ్గించారు. మెడికల్ స్టోర్లలో కానీ, నిత్యావసర వస్తువుల అమ్మకాల దుకాణాలలో కానీ జీఎస్టీ మిగులు ప్రజలకు అందడం లేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయల ఆర్థిక భారాన్ని భరించాల్సిందే తప్ప.. ప్రజలకు జీఎస్టీ ఫలాలు అందే అవకాశం లేదు. దీనిపై నిఘా పెట్టి ప్రజలకు ఆదా చేకూర్చే విషయంలో సంబంధిత అధికారులు మీనవేషాలు లెక్కిస్తుండం ప్రశ్నార్థకంగా మారింది.

ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవు

జిల్లా వ్యాప్తంగా జీఎస్టీ పన్నుల భారం తగ్గింపుపై విస్తృత ప్రచారం చేశాము. నెలరోజుల పాటు కలెక్టర్ నుంచి అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో జీఎస్టీ ఫలాలపై మండల, సచివాలయాల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాం. కడప డివిజన్ పరిధిలో 7 సర్కిళ్ల ఆఫీసుల పరిధిలో పన్నుల వసూళ్లతో పాటు జీఎస్టీ అమలుపై ఆరాతీస్తున్నాం. అధిక ధరలకు అమ్ముతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే రిటైల్ వ్యాపార సముదాయాలపై దాడులు చేసి చర్యలు తీసుకుంటాము.

- సుమతి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్

ముగిసిన జగన్ పర్యటన



జగన్ క్యాంప్ కార్యాలయం వద్ద కార్యకర్తల సందడి

పులివెందుల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల మూడు రోజుల పర్యటన ముగిసింది. ఆయన బెంగళూరు నుంచి మంగళవారం సాయంత్రం పులివెందుల చేరుకున్నారు. బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం ఉదయం తన ఇంట్లో పలువురు నాయకులు ఆయనను కలిశారు. 8.30 గంటల ప్రాంతంలో జగన్ క్యాంప్ కార్యాలయానికి వచ్చి కార్యకర్తలను, అభిమానులను కలిశారు. అనంతరం బాకరాపురంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 8.40గంటల ప్రాంతంలో బెంగళూరుకు హెలికాప్టర్‌లో వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం, ఒంటిమిట్ట అన్నమయ్యలోకే

కడప కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజనలో భాగంగా సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను అన్నమయ్య జిల్లా, రాజంపేట డివిజన్‌లోకి విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా నిన్నటివరకు వైఎస్సార్ కడప జిల్లాలోని కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ఈ రెండు మండలాలు ఇక మీదట అధికారికంగా రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కొనసాగనున్నట్లు ప్రభుత్వం జీవో జారీ చేసింది.

బతికి ఉండగానే...
భార్యకు డెత్ సర్టిఫికెట్

- భర్తపై పోలీసులకు ఫిర్యాదు

5

ఉల్లాసంగా జిల్లా స్థాయి
పారా అథ్లెటిక్స్ క్రీడలు

డిజిటల్ అరెస్టు పేరుతో..
రూ.1.62 కోట్లు కొట్టేశారు

- ఆరుగురు నిందితుల అరెస్టు
- ఎస్పీ నచికేత్ విశ్వనాథ్




నిందితుల అరెస్టు చూపి వివరాలు తెలుపుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో రూ.1.62 కోట్లు కొట్టేయడంతో పాటు ఒకరి మృతికి కారణమైన ఆరుగురు సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశామని, పరారీలో ఉన్న కీలక నిందితులకోసం గాలిస్తున్నామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, పులివెందుల సీఐ సీతారామిరెడ్డి, సైబర్ సెల్ సీఐ మధుసూదన్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ..

డిల్లీకి చెందిన తివారీ, మరికొంత మంది సైబర్ నేరగాళ్లతో కలిసి పులివెందులకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పుట్లూరు ప్రకాశ్‌రెడ్డికి డిజిటల్ అరెస్టు పేరుతో కాల్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేసి మూడు దఫాలుగా రూ.1,62,83,000 పలు అకౌంట్లకు వేయించుకున్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు పెట్టిన వత్తిడి వల్ల ప్రకాశ్‌రెడ్డి గుండెపోటుతో మృతిచెందాడు. అనంతరం కొడుకు తన తండ్రి అకౌంట్లను పరిశీలించగా అందులోని డబ్బంతా వేరే అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ అయిన విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచడంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన చిక్కరాజు మధు, ఆదిత్య మనోమర్, అర్జున నేలమాక్కళ ఆలిసిద్దయ్య, రోషన్ ఉల్లాస్ వేమేకర్, సురేశ్ సంకేతే, హరిష్ శ్రీనివాస్ పులివెందులకు వచ్చినట్లు సమాచారం రావడంతో వారిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి వద్ద నుంచి లక్షా 5300 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు కార్పొరేట్ కంపెనీ అకౌంట్లు చూసే ఆడిటర్, ఎస్ బ్యాంకు ఉద్యోగి రాకేశ్, ఢిల్లీ ప్రాంతానికి చెందిన తివారీ పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. చిక్కరాజు మధు హైదరాబాదులో సైబర్ కేసుపై అరెస్టు అయి బెయిలుపై వచ్చి మళ్లీ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. చిక్కరాజు మధు, తివారీ, రాకేశ్‌పై పలు రాష్ట్రాల్లో ఫిర్యాదులు ఉన్నాయన్నారు.

మతసామరస్యానికి ప్రతీక

- కలసపాడు పరిపేతురు పరిపాలు చర్చికి 138 ఏళ్లు
- 2, 3 తేదీల్లో వార్షికోత్సవ తిరునాళ్ల



కలసపాడులోని పరిపేతురు పరిపాలు చర్చి

కలసపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కలసపాడులో సగిలేరు ఒడ్డున నిర్మించిన పరిపేతురు.. పరిపౌలు చర్చి మతసామరస్యానికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తోంది. ఎంతో పురాతనమైన ఈ చర్చి ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. 1884లో ఇంగ్లాండ్ దేశానికి చెందిన రెవరెండ్ ఆర్థర్ ఇన్‌మన్ ఆధ్వర్యంలో దీని నిర్మాణం ప్రారంభించారు. 1887 డిసెంబరు 3 నాటికి పూర్తిచేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రతిష్ఠ మహోత్సవాన్ని చర్చి తిరునాళ్ల పేరుతో నిర్వహిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి ఈ తిరునాళ్ల కు వేలాదిగా కులమతాలకతీతంగా తరలివచ్చి ప్రార్థనలు చేసుకుని వెళ్తారు. ఇక్కడ ప్రార్థనలు చేస్తే కోరికలు నెరవేరుతాయనే నమ్మకం ఉంది. కోరికలు నెరవేరిన భక్తులు తలనీలాలు సమర్పించడం, ఆలయానికి కోడిపుంజును ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది.



చర్చి శిలాఫలకం

గుడి నిర్మాణం ప్రత్యేకతలు

చర్చి నిర్మాణానికి మొత్తం మట్టి ఇటుకలు, గచ్చును వాడారు. స్థానికంగా దొరికే బంకమట్టిని కాల్చి ఇటుకలు తయారు చేశారు. సున్నము, బెల్లం, కోడిగుడ్లు, కరక్కాయలతో తయారు చేసిన మిశ్రమాన్ని కట్టడానికి ఉపయోగించారు. కేరళ రాష్ట్రం లో తయారైన పెంకులను ఆలయం పైకప్పునకు వాడారు. తలుపులు దూలాలకు బర్మాటేకును ఉపయోగించారు. అందుకే నిర్మాణం జరిగి 138 ఏళ్లు పూర్తయినా ఈ కట్టడం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. చర్చి వెలుపల ఏర్పాటుచేసిన గంటకు ప్రత్యేకత ఉంది. గడియారం లేని ఆరోజుల్లో సమయాన్ని తెలిపేందుకు ఆ గంటను మోగించేవారు. 40అడుగుల ఎత్తులో నిర్మించిన గంట భక్తులను ఆకట్టుకుంటుంది.

తిరునాళ్లకు ఏర్పాట్లు

భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు వర్షానికి తడవకుండా జర్మన్ టెంట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పెద్దఎత్తున తరలివచ్చే మహిళల కోసం ప్రత్యేక స్నానపుగదులు నిర్మించారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన డీఐజీ



రికార్డులను పరిశీలిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్

జమ్మలమడుగు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు సబ్‌జైలును గురువారం రాయలసీమ జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఖైదీలు ఉంటున్న గదులను పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డీఎస్పీ గురుశేఖర్, సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, అమీర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ తల్లికి కన్నీటి వీడ్కోలు

- హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- పెన్నాతీరాన దహన క్రియలు



తల్లి అంతిమ యాత్రలో సీఎం రమేశ్

ఎర్రగుంట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తల్లి చింతకుంట రత్నమ్మ(83)కు గురువారం కన్నీటితో తుది వీడ్కోలు పలికారు. పోట్లదుర్తిలోని తమ స్వగృహంలో అంత్యక్రియలకు సంబంధించిన క్రతువును కుమారుల చేత పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భర్త సీఎం మునిస్వామినాయుడు, కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనవరాండ్రు, సమీప బంధువులు కన్నీటి పర్యంతం అయ్యారు. రత్నమ్మ భౌతికకాయాన్ని సందర్శించేందుకు ప్రజాప్రతినిదులు, ప్రజలు, బంధువులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం 11గంటలకు అంతిమ యాత్ర ప్రారంభం అయింది. దారిపొడవునా పూలు చల్లుతూ ఆమెకు నివాళులు అర్పించారు. కుమారులు సీఎం సురేశ్, సీఎం రమేశ్, సీఎం రాజేశ్‌లు తల్లి పాడె మోశారు. పెన్నా తీరంలో ఆమె భౌతికకాయానికి దహనక్రియలు నిర్వహించారు. మంత్రి కొల్లురవీంద్ర, తెలంగాణ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, డిపూటీ స్పీకర్ రఘురామరాజు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, పుత్రా కృష్ణచైతన్య రెడ్డి, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రా రావు, కనకమేడల రవీంద్ర కుమార్, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, టీడీపీ నాయకులు హరిప్రసాద్, పురుషోత్తంరెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధువులు, అభిమానులు నివాళి అర్పించారు. డీఎస్పీ వేంకటేశ్వరరావు, సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నాగమురళి, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



చింతకుంట రత్నమ్మ భౌతికకాయం వద్ద కన్నీటి పర్యంతం అవుతున్న సీఎం మునిస్వామి నాయుడు, సీఎం రమేశ్ సోదరులు, కుటుంబ సభ్యులు

ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే...!

- శాశ్వత భవనాల గురించి పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు
- ఇదీ రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్, తపాలా కార్యాలయాల తీరు

సుండుపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలతో సంబంధం ఉండే రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, తపాలా కార్యాలయాలు ఏళ్ల తరబడి అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చిన్నపాటి భవనాల్లో కార్యాలయాలు ఉండటంతో ఉద్యోగులతో పాటు పని నిమిత్తం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించడం లేదు. అలాగని స్థలాల సమస్యా అంటే అదీ లేదు. సుండుపల్లె మండల కేంద్రంలో లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు మాయమైపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో విలువైన ప్రభుత్వ స్థలాలను కొంతమంది వైసీపీ నాయకులు ఆక్రమించి అమ్మకాలు నిర్వహించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వంలోనైనా సొంత భవన నిర్మాణాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



అద్దె భవనాల్లో ఉన్న తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

దశాబ్దాలుగా అద్దె భవనాలే...

సుండుపల్లె మండల కేంద్రంలో దశాబ్దాలుగా అద్దె భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. సుండుపల్లె అత్యంత మారుమూల మండలం. సుమారు 90 వేల పైచిలుకు జనాభా కలిగి మండలంలో శాశ్వత తహసీల్దార్ కార్యాలయం నిర్మించకపోవడంతో అద్దె భవనాల్లో సేవలు అందిస్తున్నారు. 15 గ్రామ పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పలు రకాల అవసరాల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వస్తారు. సరైన భవన సదుపాయం లేకపోవడంతో రైతులు రెవెన్యూ సేవలకు దూరమవుతున్నారు. అధికారులు అందరూ కూర్చుని సేవలు అందించే పరిస్థితి లేదు. అద్దె భవనానికి నెలకు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. మండల వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు అద్దె భవనాల్లో ఉంటూ సేవలు అందిస్తున్నా శాశ్వత నిర్మాణాలకు ఎటువంటి పురోగతి లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడా అద్దె భవనంలో కొనసాగుతోంది. సుండుపల్లె మండల కేంద్రంలో 1995 సంవత్సరం నుంచి సబ్ రిజిస్ట్రార్ సేవలు ప్రజలకు అందిస్తున్నా ఇప్పటి వరకు శాశ్వత భవనం లేదు. సుమారు 30 సంవత్సరాల నుంచి లక్షల రూపాయలు అద్దె భవనాలకు ప్రభుత్వం నగదు చెల్లిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనంకు అద్దె నెలకు రూ.10,619 చెల్లిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వానికి పెనుభారంగా మారుతోంది.

సమస్యపై అధికారుల దృష్టికి



సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తాము. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్నాము. ప్రతి నెలా ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. శాశ్వత భవనం ఏర్పాటైతే రైతులకు, ప్రజలకు ఎంతో మేలుగా ఉంటుంది. మారుమూల మండలం పెద్ద మండలం కావడంతో పెద్ద సంఖ్యలో పలు సమస్యలపై ప్రజలు, రైతుల వస్తూ ఉంటారు. గతంలో దాతలు తహసీల్దార్ కార్యాలయం కోసం ఇచ్చిన స్థలంలో నిర్మించకూడదని కోర్టుకు వెళ్లారు. ప్రభుత్వ స్థలం చూసి ప్రతిపాదనలు పంపిస్తాము.

-మహబూబ్‌చాంద్, తహసీల్దార్, సుండుపల్లె

చిరునామాలు మారుస్తున్నారే గానీ...

సుండుపల్లెలో రెవెన్యూ కార్యాలయం ఒకచోట నుంచి మరొక అద్దె భవనంలోకి మారుస్తున్నారే కానీ ఇప్పటి వరకు సొంత భవన నిర్మాణం ఊసెత్తడం లేదు. తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ ఇంత ప్రధానమైన కార్యాలయాలు ఇరుకు గదుల అద్దె భవనంలో నిర్వహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి అధికంగా ●ప్రప రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో రద్దీ అధికంగా ఉంటోంది. అయినా అధికారులు సొంత భవన నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న మహేంద్రన్

రాయచోటిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఏఐసీసీ అబ్జర్వర్ కె.మహేంద్రన్ తెలిపారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటన్ సృజన్ అభియాన్ (సంస్థాగత నిర్మాణ కార్యక్రమం) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి ఆసక్తి కలిగిన నాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఏపీసీసీ అబ్జర్వర్ అశోక్‌రత్నం, అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి ఎస్ఎండీ గౌస్, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, సేవాదళ్ సభ్యులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కిరణ్‌కుమార్



ఓసూరి కిరణ్‌కుమార్

మదనపల్లె అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన ఓసూరి కిరణ్‌కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సి.కుమార్‌స్వామి, మేమిరెడ్డి సురేంద్రనాథరెడ్డిలు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం వ్యవసాయ పురోభివృద్ధికి తోడ్పాటు ఇస్తూ రైతులకు శిక్షణ, మార్కెట్ ఎగుమతి అవకాశాలు, ఆధునిక సాంకేతిక వ్యవసాయం, సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

ఆయుష్ ఆసుపత్రి నిర్మాణ స్థలం పరిశీలన



డాక్యుమెంట్స్‌ను పరిశీలిస్తున్న జేసీ

రాయచోటి (నేతాజీసర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆయుష్ ఆసుపత్రి నిర్మించేందుకు ఎంపిక చేసిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది సంబంధిత వివరాలను ఆయనకు వివరించారు.

విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలి



మాట్లాడుతున్న యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్

రాయచోటిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో అటల్ క్యాలెండర్‌ను అనుసరించి క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలని యునిసెఫ్ ప్రతినిధి సుదర్శన్ సూచించారు. స్థానిక మాసాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ పాఠశాల వర్క్‌షాప్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు రూపొందిస్తున్న ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ప్రయోగశాలలో అటల్ క్యాలెండర్‌ను అనుసరించి క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలని సూచించారు. అటల్ ప్రయోగశాలలో కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే విద్యార్థులు శాస్త్రవేత్తలుగా, వ్యవస్థాపకులుగానూ రూపొందుతారన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంవో అసదుల్లా, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబులరెడ్డి, రీసోర్స్ పర్సన్స్ ఆంజనేయులు, వేణుగోపాల్‌రెడ్డి, మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హరినామ సంకీర్తనలతో పులకించిన సంబేపల్లె



రథంపై స్వామి ఊరేగింపు, పాదయాత్రలో హరేకృష్ణ- హరేరామ భక్తులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) నిర్వహిస్తున్న 7వ పాదయాత్ర బృందం గురువారం సంబేపల్లెకు చేరుకుంది. కృష్ణ- బలరాములు, భక్తివేదాంత స్వామి ప్రభుపాద విగ్రహాలు కలిగిన రథం, దానికి కట్టిన ఎద్దులు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రచారకులు మాట్లాడుతూ రోజుకు ఒక్కసారైనా హరేకృష్ణ-హరేరామ మహామంత్రాన్ని జపిస్తే మనసుకు శాంతి, జీవనానికి శోభ, ఆత్మకు ముక్తి లభిస్తుందన్నారు. 1984లో ప్రారంభమైన ఈ పాదయాత్ర ఇప్పటి వరకు ఆరుసార్లు విజయవంతంగా పూర్తి చేసుకుని ప్రస్తుతం 7వ పర్యాయం నడుస్తోందని తెలిపారు

ఏడాదిన్నరకు ఎంపీ రాక..!

- వినతుల పేరిట పరామర్శలు
- ఎంపీని కలిసేందుకు వచ్చిన ప్రజలు బేజారు



ఎంపీడీవో కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్నఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి.. ఏడాదిన్నర తర్వాత గురువారం మదనపల్లెకు విచ్చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కలసిన పార్టీ శ్రేణులను పలకరిస్తూ, అన్నా..బాగున్నావా? పిల్లలు బాగున్నారా? ఏం చేస్తున్నారంటూ అడిగి తెలుసుకున్నారు. కాగా.. ఎంపీటీసీలు, అధికారులతో ఎంపీ సమీక్షిస్తారని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని వైసీపీ వారు ప్రచారం చేశారు. వైసీపీ నేతలే కాదు..అటు అధికారులు కూడా ఇదే ప్రచారం చేశారు.

దీంతో మదనపల్లె మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు హాజరయ్యారు. అలాగే అన్నిశాఖల అధికారులు కూడా హాజరయ్యారు. కానీ అక్కడ సమీక్ష లేదు. సమావేశం అంతకంటే లేదు. వచ్చినోళ్లంతా వచ్చినట్లు ఎంపీని వరుసగా వెళ్లి కలుస్తూ సన్మానించడం, సెల్ఫీలు, ఫొటోలకు పోటీపడ్డారు. దీంతో ఎంపీని కలిసేందుకు వచ్చిన ప్రజలు బేజారు పడ్డారు. ఎంపీ రాక సందర్భంగా వైసీపీ వారు ర్యాలీ చేయడంతో సీటీఎం రోడ్డు, చిత్తూరు బస్టాండు సర్కిల్‌లో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి అరగంటకుపైగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎంపీకి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, వైసీపీ స్థానిక ఇన్‌చార్జి ఎస్.నిసార్‌అహ్మద్, ఆ పార్టీ యువనాయకుడు హర్షవర్ధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీసభ్యుడు తట్టి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ వేర్వేరుగా స్వాగతం పలికారు.

కాగా.. మదనపల్లెను జిల్లా చేయలేని ఎంపీ.. మదనపల్లె పర్యటనకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని, ఎంపీ పర్యటనను అడ్డుకుంటామని తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు బుధవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా స్థానిక వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు నీరుగట్టువారి పల్లెలోని తెలుగుయువత అధ్యక్షుని నివాసానికి వెళ్లి ఆరా తీశారు. ఎంపీ పర్యటనను అడ్డుకుంటున్నారా? ఎక్కడైనా పార్టీశ్రేణులు ఆందోళనకు దిగే అవకాశం ఉందా? అంటూ ఆయన నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గుంజనేరులో వ్యక్తి మృతి

పెనగలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గుంజనేరులో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ రాముడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని కొండూరు పంచాయతీ తిరణంపల్లెకు చెందిన నన్నూరి రాజేశ్ (34) సిరిచాపల వ్యాపారం చేస్తుంటాడు. నాలుగు రోజులుగా అతను ఇంటికి రాలేదు. అతడి భార్య విజయ కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో, వ్యాపారం పనిపై ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉంటాడని భావించారు. ఈ నేపథ్యంలో గురువారం ఎ-రాచపల్లె సమీపంలో గుంజనేరులోని ముళ్ల పొదలకు తగులుకున్న మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం తలకు చుట్టుకుని ఉన్న లుంగీ, టవల్‌ను పరిశీలించగా అందులో సెల్‌ఫోన్ లభించింది. దాని ఆధారంగా మృతుడు తిరణంపల్లెకు చెందిన రాజేశ్‌గా గుర్తించారు. మద్యం మత్తులో ప్రవాహంలోకి దిగడంతోనే అతను మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని రాజంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

గుళికల మందు తిని బాలిక మృతి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి తీసుకెళ్లలేదని ఓ బాలిక గుళికల మందు తిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు జె.వడ్డెపల్లెకు చెందిన లక్ష్మీ ప్రసన్న (15) బి.యర్రగుడి గ్రామంలో జరుగుతున్న తమ బంధువుల పెళ్లికి తానూ వస్తానని తల్లిని కోరింది. అందుకు ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై గుళికల మందు తినింది. విషయం గమనించి తల్లి ఆమెను రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

ఝార్ఖండ్ యువకుడు ఆత్మహత్య



మదనపల్లె అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకుడు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా సీఐ కళావెంకటరమణ వివరాల మేరకు... ఝార్ఖండ్ రాష్ట్రం, హసేన్‌బాద్ జిల్లా, జామియా గ్రామానికి చెందిన రాంప్రీత్ వార్ కుమారుడు మోతిరావ్ వార్ (23) రాజంపేటకు చెందిన సెంట్రింగ్ మేస్త్రీ శ్రీనివాసులు వద్ద పనిచేస్తున్నాడు. పోతబోలు వద్ద ఓ ఇంటిపని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఏమైందో కానీ గురువారం పోతబోలు కురవపల్లె సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

రామాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కువైత్‌కు వెళ్లిన భర్త తిరిగి రాలేదని మనస్థాపానికి గురై ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి కథనం మేరకు... పుల్లంపేట మండలం కేతరాజుగారిపల్లెకు చెందిన లక్ష్మీదేవికి (36) అదే గ్రామానికి చెందిన వెంకటేశ్‌తో 2008లో వివాహమైంది. వారికి ఇంటర్మీడియట్ చదివే కూతురు, పదో తరగతి చదివే కుమారుడు ఉన్నారు. 2014లో ఈమె ఉపాధి నిమిత్తం కువైత్‌కు వెళ్లింది. అక్కడ రామాపురం మండలం గాండ్లపల్లెకు చెందిన సురేంద్రను రెండో వివాహం చేసుకుంది. ఇటీవల ఆమె ఒంటరిగానే తిరిగి వచ్చి రెండో భర్త ఇంట్లోనే నివసిస్తోంది. నాలుగు నెలలైనా భర్త ఇండియాకు తిరిగిరాకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న వీఆర్వో పుష్పరాజ్ రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వినీత్ మృతి కేసులో ముగ్గురికి బెయిలు మంజూరు

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వినీత్‌కుమార్‌రాజు మృతి కేసులో అరెస్ట్ అయిన నలుగురు నిందితులను కలికిరి పోలీసులు గురువారం వాయల్పాడు కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయాధికారి నిందితుల్లో ముగ్గురికి బెయిల్ మంజూరు చేశారు. నలుగురు నిందితుల్లో అబుబెకర్, పాలగిరి అహ్మద్, మందా నరేష్‌లను బెయిలుపై విడుదల చేశారు. వినీత్‌ను కారుతో ఢీకొట్టి అతడి మృతికి కారణమైన మరో నిందితుడు నౌషద్ బాషా (బబ్లూ)కు మాత్రం న్యాయాధికారి రిమాండు విధించారు.

అక్రమాలపై విచారణకు

చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ నియామకం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై విచారణకు అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ ఎ.వెంకటరమణమూర్తిని రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ నియమించారు. ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై కడప జిల్లా డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ ఈనెల 25న బి.కొత్తకోటకు చేరుకుని విచారణ జరిపారు. అక్కడి అక్రమాలపై పలువురు కక్షిదారులు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ఇక్కడి అక్రమాల డొంక కదిలింది. పలువురు కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ అవినీతిపై పిటిషన్ల రూపంలో అక్రమాలను వివరించారు. ఆస్తులు, క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే మార్కెట్ విలువలో ఒక శాతం లంచం రూపంలో ఇవ్వాల్సిందేనని, ఇవ్వకుంటే వివిధ రకాలుగా కొర్రీలు పెడుతూ రిజిస్ట్రేషన్ చేయకుండా వాయిదాలు వేశారని ఆరోపించారు. స్టాంపులను వెండర్లు అధిక ధరకు అమ్ముతున్నారని, ఈసీ నకళ్లు జారీ చేయడానికి అధిక లంచం అడుగుతున్నారని ఆరోపించారు. దీంతో చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ ఏఎస్ఆర్ మూర్తిని పిటిషనర్లకు నోటీసులు ఇచ్చి విచారణ చేసి నిజానిజాలు తేల్చాలని డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ ఆదేశించారు. కార్యాలయంలో సీసీటీవీ ఫుటేజీలను, ఫైళ్లను పరిశీలించి నివేదికను ఇవ్వాలని పేర్కొన్నారు.

'మీ డబ్బు మీ హక్కు' పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సేవల విభాగం సూచనల మేరకు మీ డబ్బు-మీ హక్కు కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా ఎల్డీయం ఆంజనేయులు ఏపీజీబీ రాయచోటి కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో గత 10 సంవత్సరాల వరకు లావాదేవీలు జరపకుండా ఉన్న ఖాతాలు పునరుద్ధరించుకోవాల్సిందిగా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో శాఖ నిర్వాహక అధికారి సదాశివరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 8వ స్కై చాంపియన్ షిప్ 2025ను ఈనెల 23న స్కై మార్షల్ ఆర్ట్స్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలోని నంద్యాల పట్టణం, ఎన్టీఆర్ షాదీఖానాలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు. ఇందులో మదనపల్లె విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి అనేక మెడల్స్ సాధించారని ఏపీ స్కై కోచ్ ఎస్ ఖాదర్‌బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 29 బంగారు పతకాలు సాధించడం పట్ల ఏపీ స్కై మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ ఇస్మాయిల్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇందులో 11 ఏళ్ల వయస్సు విభాగంలో నితీష్, కుషాల్ సాయి, సాత్విక, తహఅర్పా, సాయి ప్రీతికలు, 14 ఏళ్ల విభాగంలో శైలజ, హర్షిత యశశ్విని, గణేష్, రెడ్డికావ్య, 18 ఏళ్ల విభాగంలో అయాన్, చరిత సాయి, లిఖిత్, గాయత్రి, సీనియర్ విభాగంలో ముహిజుద్దీన్ జుబేదర్, ముజహర్ ఆలి (ఓపెన్ కేటగిరి) ప్రతిభ చూపారు. గెలుపొందిన విద్యార్థులు జనవరి 5, 6, 7 తేదీల్లో హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో పాల్గొంటారని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహులు తెలిపారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

గుర్రంకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థి సుఫియాన్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం రాత్రి అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గుర్రంకొండ మండలం తరిగొండ జడ్పీ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి సుఫియాన్ ఉత్తమ ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచాడు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించిన కలెక్టర్ అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పది పరీక్షలో మంచి మార్కులు సాధించాలని విద్యార్థికి సూచించారు. కార్యక్రమంలో డీఈవో సుబ్రమణ్యం, హెచ్‌ఎం రామచంద్ర, ఉపాధ్యాయులు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమి పూజ

- కడప-రేణిగుంట రహదారి పనులు ప్రారంభం
- 122 కిలోమీటర్లు.. రూ.3232 కోట్లు

రాజంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుమారు మూడేళ్లుగా తీవ్ర జాప్యానికి గురవుతున్న కడప-రేణిగుంట 716 గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమి పూజ చేశారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టు ప్రతినిధులు బుధవారం రాజంపేట మండలం కూచివారిపల్లె వద్ద ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ప్రస్తుతం కడప-రేణిగుంట మధ్య రెండు లేన్ల రహదారి పూర్తిగా పాడై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ సమయంలో మూడేళ్లుగా ఊరిస్తున్న నాలుగు లేన్ల రహదారికి భూమి పూజ జరగడంతో రెండేళ్లలో ఈ పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రోడ్డు పనులు ఇలా...

భాకరాపేట నుంచి కడప వరకు ఇప్పుడున్న రోడ్డునే నాలుగు లేన్లుగా వేస్తారు. భాకరాపేట నుంచి రైల్వేకోడూరు వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు కాకుండా రైల్వేలైను అవతల అటవీ మార్గం ద్వారా సుమారు 82 కిలోమీటర్ల మేర కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారిని ఏర్పాటు చేస్తారు. అదే రైల్వే లైనుకు అవతల పల్లె మార్గాలకు దూరంలో అనగా జనావాసాలకు దూరంగా 82 కిలోమీటర్ల మేర ఇప్పుడున్న రెండు లైన్లు కాకుండా నాలుగు లేన్ల రోడ్డును భాకరాపేట నుంచి కోడూరుకు వేయడం వల్ల ప్రయాణం బాగా సాగుతుంది. అలాగే శెట్టిగుంట నుంచి రేణిగుంట వరకు ప్రస్తుతమున్న రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్లుగా ఏర్పాటు చేస్తారు. అయితే ప్రస్తుతమున్న రోడ్డునే నాలుగు లేన్లుగా మారుస్తారు. మొత్తంగా 122 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిలో కడప నుంచి చిన్నఓరంపాడు వరకు 64 కిలోమీటర్ల రోడ్డును, చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 54 కిలోమీటర్ల మరో రోడ్డును రెండు ప్యాకేజీలుగా ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు ప్యాకేజీల రోడ్డు పనులను గతంలో టెండరు వేసే సమయంలో రూ.3232 కోట్లతో ఈ రోడ్డును లక్ష్మీ ఇన్‌ఫ్రా అనే సంస్థ దక్కించుకుంది. ఈ రోడ్డుకు కేంద్ర వన్యప్రాణుల సంరక్షణ విభాగం అనుమతి ఇచ్చినందున త్వరలో పనులు ప్రారంభించేందుకు జాతీయ రహదారుల సాధికార సంస్థ వెంటనే పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టింది. రోడ్డు అంతా ఒకటిన్నర మీటరు ఎత్తులో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా హైవేలో 55 కిలోమీటర్ల మేర 11 చోట్ల భారీ వంతెనలు నిర్మించనున్నారు. ఆయా ప్రాంతాల్లో మండలాలు, ప్రధాన గ్రామాలకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డును కూడా ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు కిందనే బ్రిడ్జిలు, కాలువలు ఏర్పాటు చేస్తారు. బాలుపల్లె అటవీ మార్గంలో శెట్టిగుంట నుంచి బాలుపల్లె ప్రాంతంలో వన్యప్రాణులు అటు ఇటు తిరగడానికి రోడ్డు కింద కాలువల రూపేణా మార్గాలు ఏర్పాటు చేస్తారు.



రాజంపేట మండలం కూచివారిపల్లె వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేకి భూమి పూజ చేస్తున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు

బంగారు దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



బంగారు నగల దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు

పోరుమామిళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని బంగారు దుకాణాలలో గురువారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు తనిఖీలు చేశారు. మహాత్మాగాంధీ విగ్రహం సర్కిల్‌లో ఉన్న బంగారు దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను, సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించారు. ఒక దుకాణంలో తూకాల్లో తేడాలు రావడంతో రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈదుళ్లపల్లె సమీపంలో ఉన్న రైస్‌మిల్లును తనిఖీ చేశారు. కడప డీసీటీవో గీతావాణి, బాబు, ఎన్ ఫోర్స్‌మెంటు అధికారులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి



మైదుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సి పాలిటీ పరిధిలోని వనిపెంట రోడ్డులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇందిరమ్మ కాలనీకి చెందిన మునగల వెంకటరమణ (65) సైకిల్‌పై వెలు తుండగా వెంకటేశ్వరా లారీ కాటా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రైలు ఢీకొని 28 గొర్రెలు మృతి



సీకేదిన్నె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రైల్వేక్రిష్టాపురం వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గాలిబోయిన సురేంద్రకు చెందిన 28 గొర్రెలు మృతిచెందాయి. గురువారం కడప-కమలాపురం రైల్వే మార్గంలో రైలు వస్తున్న సమయంలో గొర్రెల వైపు కుక్క పరుగెత్తడంతో బెదిరిపోయి ఒక్కసారిగా రైల్వేట్రాక్‌పైకి పరుగెత్తాయి. ఈ ప్రమాదంలో 28 గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.4 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని గొర్రెలకాపరి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు...



చక్రాయపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఎర్రగుడి గ్రామం బీఎన్ తాండాలో కుక్కలు దాడి చేయడంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గంగేనాయక్‌కు చెందిన గొర్రెల మందపై ఊర కుక్కలు దాడి చేశాయి. గమనించిన అతని కుమారుడు కుక్కలను తరిమేశాడు. అయితే అప్పటికే ఆరు గొర్రెలను చంపేశాయి. గొర్రెల విలువ దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు. గ్రామంలో దాదాపు 50 కుక్కలు ఉన్నాయని.. వాటి బారి నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

పులివెందుల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్య భర్తలు కలసి వాకిం గ్ చేస్తుండగా మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. వివరాలిలా... పులివెందులకు చెందిన వంకదార సుబ్బారావు తన భార్యతో కలసి పాత జూనియర్ కళాశాల సమీపంలో గురువారం ఉదయం వాకింగ్ చేస్తున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి అటువైపు వచ్చి ఉన్నట్లుండి సుబ్బారావు భార్య మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బంగారు గొలుసు లాగే సమయంలో ఆ మహిళ గట్టిగా పట్టుకోవడంతో కొంత మేర తెగిపోయింది. కొంత దొంగ ఎత్తుకుపోగా మిగిలిన గొలుసు ఆమె చేతికి వచ్చింది. తులం మూడు గ్రాముల బంగారు గొలుసును దొంగ ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

లారీని ఢీకొన్న మరో లారీ

ముద్దనూరు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని చింతకుంట సమీపంలో గురువారం ఉదయం నిలబడి ఉన్న లారీని వెనుక వైపు మరో లారీ ఢీకొడంతో లారీ ముందు భాగంగ దెబ్బతింది. తాడిపత్రి వైపు గ్రానైట్ రాయిని తీసుకువస్తున్న లారీ చింతకుంట సమీపంలో మరమ్మత్తుకు గురవడంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. అదే వైపు నుంచి మరో లారీ అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో లారీ క్యాబిన్ ఎడమ వైపు దెబ్బతింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వరిపంటను నాశనం చేసిన అడవిపందులు



నాశనం చేసిన వరిపైరు వద్ద రైతు

కలసపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను ఎంతో కష్టపడి పండించుకున్న వరి పంటను అడవి పందు లు నాశనం చేశాయని సింగరాయపల్లె గ్రామా నికి చెందిన భాస్కర్ (ఆసాది) అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఒకటిన్నర ఎకరంలో రూ.50వేలు ఖర్చుచేసి వరిపైరును సాగుచేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో పంటను కోయాల్సి ఉండగా గురువారం తెల్లవారుజామున దాదాపు ఒకటిన్నర ఎకరాకు పైగా పంటను తొక్కి పాడు చేశాయని వాపోయారు.

ఉల్లాసంగా జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ క్రీడలు



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరిస్తున్న దృశ్యం

కడప స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో బ్యాడ్మిం టన్, చెస్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలలో పలువురు బాల, బాలికలు హాజరై ఉల్లాసంగా పాల్గొన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.గౌస్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలను విభిన్న, టీజీ, సీనియర్ సిటిజన్ల అధికారి ఆర్‌వీ కృష్ణకిశోర్, పారా అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్య దర్శి దామోదర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ (డబుల్స్-సింగిల్) క్రీడలలో ప్రతిభ కనబరచిన 10 మంది ఎంపిక చేశారన్నారు. వీరు గుంటూరు డీఎస్‌ఏ మైదానంలో డిసెంబరు 1, 2 తేదీలలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్ పోటీలలో ప్రథమ, ద్వితీయ విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ మైదానంలోనే అందజేశారు. కాగా చివరగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పారా అథ్లెట్ల విజేతగా నిలిచినఉప్పు అభినవ్‌తో పాటు జిల్లా పారా క్రికెట్ క్రీడాకారుడు వై. వెంకటసుబ్బాస్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పి.ఓబులేసు (జామవా)లను సత్కరించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఎస్పీ నచికేత్

కడప క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. గురువారం నగరంలోని జిల్లా పోలీసు సంక్షేమ ఆసుపత్రిలో హైదరాబాదుకు చెందిన చిరంజీవి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చిరంజీవి హాస్పిటల్స్‌కు వారు సామాజిక బాధ్యతగా పోలీసు సిబ్బందికి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరన్నారు. పోలీసు కుటుంబాలు, రిటైరైన పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ కె.సంజీవరావు, శిల్పాపొన్నాడ, క్రిష్ణవంశీ, జయశ్రీ, సిద్దార్థరెడ్డి శిబిరంలో పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీసు యూనిట్ డాక్టర్ రేష్మ, ఆర్‌ఐ శ్రీశైలరెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన పీజీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వ విద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ తృతీయ సెమిస్టర్ పరీ క్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 91శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. వైవీయూ పోస్ట్ గ్రాడ్యు యేషన్ తృతీయ సెమిస్టర్ పరీక్షలకు 490 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 450 మంది విద్యార్థులు హాజరు కాగా, 40 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కాత్యాయని మార్గదర్శకంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అబ్జర్వర్ డాక్టర్ కె.మృత్యుంజయరావు పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణలో అసిస్టెంట్ చీఫ్ సూపరిం టెండెంట్ డాక్టర్ మునికు మారి, సిబ్బంది ఉన్నారు.

పర్వతారోహణ క్యాంప్‌లతో ఆత్మవిశ్వాసం పెంపు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్వతారోహణం క్యాంప్‌లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. నవంబరు 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జాతీయస్థాయిలో నిర్వహించిన పర్వతారోహణం క్యాంప్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ క్యాడెట్లు బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ విద్యార్థి సయ్యద్ అలీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థి మహమ్మద్‌లను కళాశాలలోని ప్రిన్సిపాల్ అభినందించారు. ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ డాక్టర్ నీలయ్య, లెఫ్టినెంట్ మహేష్, డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, క్యాడెట్లు పాల్గొన్నారు.

షార్ట్ టర్మ్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ 2025-26 విద్యాసంవత్సరానికి షార్ట్‌టర్మ్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులు (ఎస్‌టీపీసీ) ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా నోడల్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఈ కోర్సులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబరు 28 నుంచి డిసెంబరు 10వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అభ్యర్థులు రూ.400 ఫీజును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని సూచించారు.

'అన్నమయ్య జిల్లాలో మమ్మల్ని చేర్చవద్దు'



డీఆర్‌వోకు వినతి పత్రం అందజేస్తున్న పెద్దపల్లి పంచాయతీ నాయకులు

కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి కూతవేటు దూరంలో ఉన్న సిద్దవటం మండలంతో పాటు పెద్దపల్లి పంచాయతీని యథాతథంగా కడప జిల్లాలోనే ఉంచాలని ఆ గ్రామ పంచాయతీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు గురువారం కడప కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడును కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మా గ్రామ పంచాయతీ హద్దులు కడప కార్పొరేషన్‌కు సమీపంలో ఉండడంతో అధికారులను గంటలోపే కలిసి పనులు చేసుకుంటున్నామన్నారు. ఇప్పుడు పంచాయతీని అన్నమయ్య జిల్లాలో చేర్చడం వలన జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 80 కిలోమీటర్లు పోవాల్సి వుంటుందన్నారు. దీంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి సిద్దవటం మండలాన్ని కడప జిల్లాలోనే యథాతథంగా ఉంచాలని కోరారు.

నేటి నుంచి స్కూల్ బస్సుల తనిఖీ

సీకేదిన్నె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శుక్రవారం నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు స్కూలు బస్సులు తనిఖీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ ఎం.వీర్రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పాఠశాల యాజమాన్యాలకు ఈ తనిఖీలపై తెలియజేశామని, లోటుపాట్లపై సవరణ చేసుకోవాలని అన్ని విద్యాశాఖ కార్యాలయాలకు నోటీసులు కూడా పంపించామన్నారు. తనిఖీల్లో అగ్నిమాపక పరికరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, వాహనాల పనితీరు సమగ్రంగా తనిఖీ చేస్తామన్నారు. యాజమాన్యాలు బస్సుకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచి రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

జాతీయ హాకీ జట్టుకు సాయి మోహన్ ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మున్సిపల్ ఉన్నత పాఠశాల (మెయిన్) విద్యార్థి సాయిమోహన్ 69వ ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలుర విభాగంలో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. గురువారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రధానోపాధ్యాయురాలు ముబీన రెహానా విద్యార్థిని అభినందించారు. ఈనెల 20 నుంచి 24 వరకు వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సాయి మోహన్ చక్కటి ప్రతిభ కనబ రచడంతో జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో రాజ స్థాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు.

కడప జిల్లా వాసికి అరుదైన గుర్తింపు



కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన 100 కాంపిటీటివ్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీలలో కడప జిల్లాకు చెందిన ఎం.రత్నంకు అరుదైన గుర్తింపు దక్కింది. ఢిల్లీకి చెందిన నీతి ఆయోగ్, రాష్ట్రీయ నైతికత సమ్మాన్ వారు 2025 సంవత్సరానికి దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ప్రసిద్ధిగాంచిన 100 కాంపి టీటివ్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీ సర్వేలో కడప నగరం ఆలంఖాన్ పల్లెకు చెందిన రత్నంకు చోటు లభించింది. అందుకు గాను ఆయనకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రశంసాపత్రం అందజేశారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

ఖాజీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట మోడల్ స్కూల్లో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినికి ప్రేమలేఖ రాయడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై సహచర విద్యార్థులు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ఆ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. కాగా ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడికి గత నాలుగు రోజులుగా మతిస్థిమితం బాగాలేదని, దాంతో ఉన్నతా ధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

తార ప్లాంట్‌లో వస్తువులు కాల్చివేత

ముద్దనూరు నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్న దుద్యాల గ్రామ సమీపంలో నున్న తార ప్లాంట్‌లో వస్తువులను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేసినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. రాత్రి ప్లాంట్‌లో నున్న గదిలో సెక్యూరిటీ గార్డు నిద్రపోతుండగా గుర్తుతెలియని వ్యక్తులు గదికి తాళం వేసి, ప్లాంట్‌లోని వస్తువులకు నిప్పు పెట్టి కాల్చివేశారు. ప్లాంట్ సూపర్‌వైజర్ కొర్రపాటి ప్రతాపరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బతికి ఉండగానే... భార్యకు డెత్ సర్టిఫికెట్

● భర్తపై పోలీసులకు ఫిర్యాదు



కలసపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను బతికి ఉండగానే చనిపోయినట్లు తన భర్త డెత్ సర్టిఫికెట్ కొరియర్ ద్వారా పంపాడని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కలసపాడు మండలం దూలం వారిపల్లెకు చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ గురువారం న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. గ్రామానికి చెందిన అంకయ్య, ఓబు శమ్మల కుమార్తె ఆదిలక్ష్మిని 18 సంవత్సరాల క్రితం ముద్దనూరుకు చెందిన పొన్నా మారుతి రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ముగ్గురు మగపిల్లలు ఉన్నారు. గత కొన్ని రోజుల నుంచి భార్య భర్తల మధ్య చిన్నచిన్న గొడవలు జరుగుతుండేవి. విసుగు చెందిన ఆమె 15రోజుల క్రితం స్వగ్రామమైన కలసపాడు మండలం దూలంవారిపల్లెకు చేరుకుంది. గురువారం కొరియర్ ద్వారా వచ్చిన డెత్ సర్టిఫికెట్‌ను గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న ఆమె అవాక్కైంది. విషయం తల్లితండ్రులకు తెలిపి కలసపాడు పోలీసులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. సర్టిఫికెట్ ఎవరు ఇచ్చారు, అది ఎంత వరకు నిజమైంది, ఎవరు పంపారు అనే విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

భార్య రాకపోవడంతోనే...

తన భార్య ముగ్గురు పిల్లలను వదిలి పోయిందని.. చాలా సార్లు తమ వద్దకు రావాలని చెప్పినా వినకపోవడంతోనే.. తన తల్లి పేరుతో ఉన్న డెత్ సర్టిఫికెట్‌ను మార్పు చేసి పంపాల్సి వచ్చిందని మారుతి రాజు తెలిపాడు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


ఆకుతోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సీకేదిన్నె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమలపాకు తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని డాక్టర్‌వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వెంకటరామన్న గూడెం శాస్త్రవేత్తలు నాగలక్ష్మీ, రంగన్న తెలిపారు. మండలంలోని కొలుములపల్లె క్రిష్టాపురం గ్రామంలో తమలపాకు తోటలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమలపాకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చని, దిగుబడులు పెంచుకునేందుకు కూడా అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు, చీడపీడల సమగ్ర యాజమాన్యంపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుని పంటలను రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త మానస, తదితరులు పాల్గొన్నారు.

'అరటి రైతులపై జగన్‌ది కపటప్రేమ'


అరటికాయలను పరిశీలిస్తున్న అమర్‌నాథ్‌యాదవ్

పులివెందుల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అరటి రైతులపై కపటప్రేమ చూపిస్తున్నారని పులివెందుల వ్యవసాయ కమిటీ చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం అమర్‌నాథ్‌యాదవ్ అరటి తోటల వద్దకెళ్లి పంటలను పరిశీలించి రైతులతో చర్చించారు. పులివెందుల ప్రాంతంలో వేలాది మంది రైతులు అరటి సాగుపైనే ఎక్కువ మక్కువ చూపుతుంటారన్నారు. వైసీపీ హయాంలో ధర లేక రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్కరోజు కూడా ఇటువైపు కన్నెత్తి చూడలేదన్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రిపురం వ్యవసాయ కమిటీ చైర్మన్ రామసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ కమలాపురమే ధ్యేయం

ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి


విజన్ యాక్షన్‌ప్లాన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కలలుగన్న స్వర్ణ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేస్తున్నారని అదే పట్టుదలతో స్వర్ణ కమలాపురంగా అభివృద్ధి చేసేందుకు ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని మూడో సచివాలయంలో విజన్ యాక్షన్‌ప్లాన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇందులో ప్రజలు వివిధ రకాల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. వెంటనే ఉన్నతాధికారులకు తెలిపి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామిరెడ్డి, ఎంపీడీవో కెజియా, వీరపునాయునిపల్లె ఎంపీడీవో చలపతి, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు


సమస్యలను వింటున్న శ్రీనివాసరెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప రీజియన్ వ్యాపితంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక నిరాహారదీక్షలు గురువారం నాటికి పదో రోజుకు చేరుకున్నాయి. అయినప్పటికీ సంబంధిత కడప రీజనల్ మేనేజర్ ఏ మాత్రం స్పందించకపోవడంతో ఎన్‌ఎంయూఏ నాయకులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వారి న్యాయమైన సమస్యలను వివరించి పరిష్కరించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను ఉపయోగించాలి


రైతులతో మాట్లాడుతున్న జేడీఏ చంద్రనాయక్

వేముల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతికత ను ఉపయోగించి పంట సాగు సరళి చేపట్టాలని జేడీఏ చంద్రానాయక్ సూచించారు. గురువారం మండలంలోని వి.కొత్తపల్లెలో జరుగుతున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని అకస్మికంగా జేడీఏ పర్యటించి రైతులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలో రైతును రాజు చేసేందుకు ఐదు కార్యాచరణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఓబులేసు, విస్తరణ అధికారి సురేష్, బీహెచ్ ఇంతియాజ్, రైతులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె..: ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టిసారించాలని, చిరుధాన్యాలైన సజ్జలు, కొర్రలు,జొన్నలు, రాగులు వంటి వాటికి మళ్లీ ప్రాధాన్యత పెరుగుతోందని జేడీఏ చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని కత్తలూరు పంచాయతీ పరిధిలోని తాటిమాకులపల్లె గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో గురువారం జేడీఏ పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కరపత్రాలను రైతులకు అందించారు. వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: ప్రతి రైతు కుటుంబానికి రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా కలుసు కోవడం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు.పాతసంగటిపల్లె గ్రామంలో గురువారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో సుమంత్‌రెడ్డి, వ్యవసాయ,పశు వైద్య సిబ్బంది,గ్రామ రైతులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: రైతును రాజు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పంచసూత్రాలతో మరో ముందడుగు వేస్తోందని మండల ప్రత్యేక అధికారి రమాదేవి, ఏవో చెన్నారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాగిమానుపల్లె గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్టాప్, వాష్ అండ్ గో



కడప క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద స్టాప్,ఇంకా తదితర చోట్ల పోలీసులు వాష్ అండ్ గో..కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్లు, లారీలు, బస్సులు, వ్యాన్లు తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపారు. జాతీయ రహదారులపై స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. గురువారం నగరంలో బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఆయా చోట్ల అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కార్యక్రమం నిర్వహించారు. కార్లు, లారీలు, బస్సులు, వ్యాన్లను ఆపి డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపించారు.

పేదలపై ప్రతాపం చూపితే సహించేదిలేదు : సీపీఐ


మాట్లాడుతున్న గాలిచంద్ర

కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్ల పేరుతో పేదలపై ప్రతాపం చూపితే సహించేదిలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, కార్యవర్గసభ్యులు గుంటి వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి నగరపాలక సంస్థ అధికారులపై ధ్వజమెత్తారు.గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పన్ను వసూళ్లలో పెద్దలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయంగా వసూళ్ల పర్వానికి ఆజ్యం పోయడం సరైంది కాదన్నారు. జిల్లాలో ని కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, ఎర్రగుంట్ల, మైదుకూరు, కమలాపురం బద్వేలు మున్సిపాలిటీల్లో పన్నుల బకాయిలు వందల కోట్లకు చేరుకున్నాయని ఆరోపించారు. వసూలు చేయడంలో మున్సిపల్ అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పారదర్శకంగా పన్నులు వసూలు చేయాలని హెచ్చరించారు. లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటశివ, సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, రామయ్య, బాల ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం : ఎమ్మెల్యే మాధవి


ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవి

కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణ పరిష్కారం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కడప ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు. ఆ మేరకు గురువారం కడప నగర ద్వారకనారగ్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక ప్రజాదర్బారు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర ప్రజలు పెద్దఎత్తున ఆమె క్యాంపు కార్యాలయం చేరుకుని పలు సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఎంతో ఓపిగ్గా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని త్వరిత గతిన ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతారని సంబంధిత అధికారులకు అక్కడికక్కడే సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

30న ప్రాంతీయ సదస్సు

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాంతీయ సదస్సు ఈనెల 30న కడప నగరం బీసీ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు, ఏఐటీయూసీ కడప జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ తెలిపారు. గురువారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కడప నగరంలోని జిల్లా పరిషత్ వద్దఉన్న భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద కరపత్రాలను పంచుతూ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఉద్దె మద్దిలేటి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కొత్త వేతనాలు అమలు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించి కొత్త వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా కోరారు. ఈ విషయంపై గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిపాలన అధికారి (ఏఓ) రంగస్వామి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జమున, ప్రభుత్వ ఆసుపత్రి సీఎస్‌ఆర్‌ఎంఓ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సునీల్, రిమ్స్ శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లపై నిఘా ఉంచాలి : ఎస్పీ

కడప క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జర గనున్న నేపథ్యంలో రౌడీసీటర్లు ట్రబుల్ మాంగర్లు, గతంలో ఎన్నికల నేరాలకు పాల్పడిన వారి కదలికలపై ప్రత్యేకనిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాద్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో కడప సబ్ డివిజన్ నేరసమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతే గ్రామసభలు, పల్లెనిద్ర గ్రామాల సందర్శన తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, బహిరంగమద్యపానం చేసేవారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

జండర్ సమానత్వంపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు

చెన్నూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల సమాఖ్య చెన్నూరు కార్యాలయంలో గురువారం జెండర్ సమానత్వంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింద. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు మాట్లాడుతూ నవంబరు 25 నుంచి డిసెంబరు 23 వరకు ఉమెన్‌సేఫ్టీ ర్యాలీ అలాగే సమావేశాలు పెట్టుకోవాలని, ఉమెన్ ఎంపవర్‌మెంటు సాధించుకోవాలని హెల్ప్‌లైను నెంబర్లయిన 181, 1098, 112ను వినియోగించుకోవాలని సూచించారు. ఏపీయం వెంకటేశ్ మాట్లాడుతూ అమ్మాయిలకు చిన్నప్పటి నుంచి చట్టాలపై అవగాహన పెంచాలన్నారు కార్యక్రమంలో ఈపీయం, ఏపీయం సీసీలు గ్రామ సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేయాలి'


మాట్లాడుతున్న ఎంపీ విజయ్‌వసంత్

కమలాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త ముందుకు రావాలని ఏఐసీసీ కోఆర్డినేటరు కన్యాకుమారి, ఎంపీ విజయవసంత్ తెలిపారు. కమలాపురం మండలపరిధిలోని కొప్పూరు వారిపల్లె గ్రామ సమీపంలో నిర్వహించిన కమలాపురం నియోజకవర్గంలో సంఘటన్ సృజన్ అభియాన్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తమటం వెంకటనరసింహులు, లీగల్ సెల్ చైర్మన్ సోమశేఖర్, కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి, గుండ్లకుంటశ్రీరాములు, మీగడ అశోక్‌కుమార్‌రెడ్డి, పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు , నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ


అన్నదానం చేస్తున్న దృశ్యం

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కాంట్రాక్టర్ రామలింగారెడ్డి కుమారుడు పవన్ భార్గవరెడ్డి 12వ వర్ధంతిని పురస్కరించుకొని వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. గురువారం కడప నగరం అభయాంజనేయస్వామి గుడిలో ప్రముఖ కాంట్రాక్టర్ వి.రామలింగారెడ్డి ఆయన కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులుపాల్గొన్నారు.



ట్రస్ట్ ఆస్తులను కాపాడాలి

అఖిలపక్ష నాయకులు డిమాండ్

కడప మారుతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర పాత బస్టాండ్ సమీపంలోని యాదాల పిచ్చయ్య ఛారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన భూములను కొంతమంది భూ కబ్జాదారులు ఆక్రమించి, కమర్షియల్ కాంప్లెక్స్‌గా ఉపయోగిస్తూ ట్రస్ట్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని, ఆ విషయంగా తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని ట్రస్ట్ ఆస్తులను కాపాడాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ట్రస్ట్‌కు సంబంధిచిన భూమి ఒక ఎకరా ఇరవైసెంట్ల భూమి ఉందన్నారు. ఆ భూమి బాలికల పాఠశాలలకుగానీ, సామాజిక సేవ కోసంగా ఉపయోగించాలని ఉన్నప్పటికీ అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు కాంప్లెక్స్ నిర్మిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ట్రస్ట్‌కు చెందిన దాతలు ప్రజా ప్రయోజనాలకోసం ఉపయోగించాలని బైలాలో తీర్మాణం చేసినప్పటికీ నగరంలోని అధికార పార్టీకి చెందిన నాయకులు బైలా తీర్మాణాలను మార్చేసి వారి స్వార్థ ప్రయోజనాల కోసం ట్రస్ట్ భూములను వాడుకోవడం సరైందికాదన్నారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు సగిలి గురప్ప, నారాయణ, కిశోర్, సత్తార్, షఫీ, అంజి, జయవర్ధన్, సుబ్బరాయుడు, దేవరశ్రీకృష్ణ, తదితరులున్నారు.

అనాథల ఆకలి తీర్చడం గొప్పవరం

కడప ఎర్రముక్కపల్లెనవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొండూరు పిచ్చమ్మ వెంకటరాజు స్మారక సంస్థ ఆధ్వర్యంలో గురువారం కడప నగరానికి చెందిన ప్రేమాలయంలో నిరాశ్రయులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటుచేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడుతూ సంస్థఅధ్యక్షుడు కొండూరు జనార్దనరాజు తన తల్లిదండ్రులైన కొండూరు పిచ్చమ్మ వెంకటరాజుల జ్ఞాపకార్థం అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అచ్చమ్మ, సుబ్బరామరాజు, కొండూరు చంద్రకళ కుటుంబ సభ్యులు నిర్వాహకుడు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలి



మెడిఫెస్ట్‌కు హాజరైన శ్రీనివాసరెడ్డి, ముక్తియార్ తదితరులు

సీకేదిన్నె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక రాయచోటి రోడ్డులోని రాజారాణి మహల్‌లో ముక్తియార్ విద్యాసంస్థల మెడిఫెస్ట్-2కె25 ఫ్రెషర్స్‌డే పార్టీలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, వీఎస్ ముక్తియార్, కరస్పాండెంట్ అలీఅక్బర్, డైరెక్టర్ హుస్సేన్ పాల్గొన్నారు.

కడప ట్రాఫిక్ సీఐగా సురేష్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

కడప క్రైం నవంబర్ 27,(ఆంధ్రజ్యోతి): కడప నగరం ట్రాఫిక్ సీఐ గా సురేష్ రెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. అన్నమయ్య జిల్లా ఎర్ర చందనం టాస్క్‌ఫోర్స్ విభాగంలో పని చేస్తూ బదిలీ పై కడపకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తామన్నారు.



ప్రాధాన్యత మేరకు అభివృద్ధి కార్యక్రమాలు : జేసీ


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ అదితి సింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో లక్ష్యం మేరకు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వరిధాన్యం కొనుగోలు, మహిళలపై నేర నియంత్రణ, గంజాయి మత్తుపదార్థాల నివారణ,సానుకూల ప్రజా దృక్పథం, జీఎస్ డబ్ల్యూ ఎస్‌సేవలు, మున్సిపల్,పారిశుధ్య చర్యలు, ఆర్జీజీఎస్, సంక్షేమ హస్టళ్ల, రెసిడెన్సియల్ పాఠశాలలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్స్ నిర్వాహకులకు సన్మానం

కడప క్రైం, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించిన హైదరాబాద్ నగరానికి చెందిన వైద్యులను గురువారం ఎస్పీ నచికేత్ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. చిరంజీవి హాస్పిటల్ కి సంబంధించి డా.సంజీవరావు, డా.శిల్ప, డా.కృష్ణ వంశీ, డా.జయశ్రీలకు ఎస్పీ జ్ఞాపికలను అందచేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం నాయకులు సురేష్, శంకర్ ఎ.ఆర్ ఎ.ఎస్.పి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్‌లేదు.. సమస్య తీరదు

● బద్వేలు పట్టణ ప్రధాన రోడ్డు పక్కనే ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్న వైనం ● వేధిస్తున్న ట్రాఫిక్ ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

బద్వేలుటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రోజు రోజుకు వాహనదారులకు పార్కింగ్ కష్టాలు అధికమవుతున్నాయి. పట్టణంలో ద్విచక్రవాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు ప్రధాన రోడ్ల పక్కనే వాహనాలను నిలిపివేస్తూ పోలీసుల ఆంక్షలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పట్టణంలో ద్విచక్రవాహనాల అనువైన పార్కింగ్ స్థలాలను మున్సిపల్ అధికారులతో పాటు పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

కన్పించని పార్కింగ్ స్థలాలు : పట్టణంతోపాటు మండల పరిధిలో సుమారు 2లక్షల మందికిపైగా జనాభా నివశిస్తుండగా, 40వేలకుపైగా ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు అంచనా. పట్టణ వాసులతో పాటు మండల పరిధిలోని ప్రజలు నిత్యం ఏదో ఒక పనిమీద పట్టణానికి వస్తుంటారు. దీంతో పట్టణంలోని నెల్లూరురోడ్డు, సిద్దవటంరోడ్డు, పోరుమామిళ్లరోడ్డు, మైదుకూరురోడ్డు, కూరగాయల మార్కెట్, మాంసపు దుకాణాల వద్ద వివిధ రకాల పనులపై వచ్చే ప్రజలతో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయపోవడంతో వాహనదారులకు కష్టాలు తప్పడంలేదు.

అధికారుల వైఫల్యం : ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో పోలీసులు రోడ్డుపై వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపకూడదని హెచ్చరిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపాలిటీ హోదాకలిగిన పట్టణాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ప్రజల సౌకర్యార్థం తప్పనిసరిగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలి. అయితే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మరోవైపు ఆటోలకు కూడా అనువైన చోట ఆటో స్టాండ్‌లు లేకపోవడంతో ట్రాఫిక్ మరింత జటిలంగా మారింది. అధికారులు దృష్టిసారించి పార్కింగ్ కోసం స్థలాలను ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



ప్రధాన రోడ్డు పక్కనే వాహనాలు నిలిపిన దృశ్యం



బద్వేలు నాలుగురోడ్ల కూడలిలో అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనాలు

ఆక్రమణలు తొలగిస్తాం



పట్టణంలో చాలా ప్రాంతాల్లో పార్కింగ్ స్థలం వదలకుండానే నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. ప్రధాన రహదారుల్లో కొత్తగా నిర్మించే షాంపింగ్ కాంప్లెక్స్‌లు, ఇళ్ల వద్ద పార్కింగ్ స్థలం వదిలి ఉంటే అనుమతులు ఇస్తున్నాం. తాత్కాలిక పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

-నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, బద్వేలు

పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు చర్యలు



పట్టణంలో పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. నాలుగు ప్రధాన రహదారుల్లో పార్కింగ్‌లేని కారణంగా వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- లింగప్ప, సీఐ, బద్వేలు

ఆయుర్వేద ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



హాస్పిటల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న రీజనల్ డిప్యూటీ డైరెక్టరు శేఖర్‌రాజు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆసుపత్రిని రీజనల్ డిప్యూటీ డైరెక్టరు శేఖర్‌రాజు గురువారం ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయుర్వే ఆసుపత్రిలోని రికార్డులు పరిశీలించి రోజూ ఆసుపత్రికి వచ్చే ప్రజల గురించి స్థానిక డాక్టరు మహేశ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ త్వరలోనే నూతనంగా ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణ పనులు చేపడుతున్నామని ఆ విషయంపైనే స్థలం పరిశీనలకు రావడం జరిగిందన్నారు. మండల ప్రజలకు ఆయుర్వేద సేవలు త్వరలో మరింతగా అందిస్తామని రీజ నల్ డిప్యూటీ డైరెక్టరు శేఖర్‌రాజు తెలిపారు.

ఆశాజనకంగా వరి దిగుబడులు



వడ్లను తూర్పారపోస్తున్న రైతన్నలు

రాజుపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ ప్రధాన పంట అయిన వరి కోత దశకు రావడంతో కోతలు జోరందుకున్నాయి. దీంతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుందూ ప్రాంతం వెంబడి ముందుగా నారుమళ్లు పోసుకున్న రైతన్నలు ఖరీఫ్‌లో వరి పంట సాగు చేశారు. దీంతో వరి పంట కోతకు దశ చేరుకున్నాయి కూలూరు. కొట్టాల, టంగుటూరు, తొండలదిన్నె, వెలవలి గ్రామ రైతులు ఈ వరి కోతలు జోరుగా జరుగుతున్నాయి. ఎకరాకు 25 నుంచి 30బస్తాల పైబడి వడ్లు అవతున్నాయి. అయితే ఒక దిక్కు కారుమబ్బులు, మరో వైపు తుఫాను హెచ్చరికలు చేస్తుండడంతో రైతన్నలు భయాందోళనలో ఉన్నారు. వరికోతలు కోయకపోతే తుఫాను ప్రభావంతో పండిన వరి నేలొరిగే ప్రమాదం ఉన్నందున ఈ కోతలు కోస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా మద్దతు ధరతో కొనేందుకు వెలవలి గ్రామంలో సెంటరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదిఏమైనా వరి కోతలు ఊపందుకున్నాయి

యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని డీవైఎఫ్ఐ కార్యదర్శి శివకుమార్ కోరారు. గురువారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో నిరుద్యోగులకు అనేక హామీలిచ్చారని, వాటిలో ప్రధానమైనవి రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఒకటి అని అన్నారు. ఉద్యోగాలకోసం యువత వేల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతున్నారని ఈ పరిస్థితుల్లో నిరుద్యోగ భృతి వారికి ఉపశమనం కలిగిస్తుందన్నారు. సూపర్-6 హామీలలో అన్నీ అమలు చేశామని చెబుతున్నప్రభుత్వం నిరుద్యోగ భృతి ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతిని అమలు చేయాలకోరారు. డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, ఉపాధ్యక్షుడు తేజ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ కేసులో విచారణాధికారి మార్పు

కలికిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పనిచేసిన నలుగురు అధికారులపై ఏసీబీ నమోదు చేసిన కేసులో విచారణ కోసం గతంలో నియమించిన విచారణాధికారి స్థానంలో మరో విచారణాధికారిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి మున్సిపల్ కమిషనరు రాధ, టీపీఎస్ పి.ఇందిర, రిటైరయిన సహాయ సిటీ ప్లానర్ కె.మునిచంద్రశేఖర్, బి.శివగురుమూర్తిలపై 2023లో ఏసీబీ నమోదు చేసిన కేసులో విచారణ నిర్వహించడానికి 2025 జూన్‌లో కడప మున్సిపల్ కార్పొరేషన్ డీసీపీ వై.వెంకరమణను విచారణ అధికారిగా ప్రభుత్వం నియమించింది. అయితే తాను 2026 జూన్‌లో పదవీ విరమణ చేయనున్నందున వ్యక్తిగత కారణాల ఆధారంగా తనకు బదులుగా ఇతరులను విచారణాధికారులుగా నియమించాలని 2023 నవంబరు 3న వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన విజ్ఞాపనను పరిశీలించి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. దరిమిలా వెంకటరమణకు బదులుగా కడప పట్టణాభివృద్ధి సంస్థ పీవో పి.శైలజను తదుపరి విచారణాధికారిగా నియమిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

విగ్రహప్రతిష్ఠ వేడుకలకు హాజరైన టీడీపీ నేతలు



విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ స్టేట్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి

బద్వేలుటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని తెలుగుగంగ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతా లక్ష్మణ హనుమత్‌సమేత శ్రీరామచంద్రస్వామి నూతన విగ్రహప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలకు ఏపీఐఐసీ స్టేట్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. గురువారం వేకువజాము నుంచే వేదమంత్రోచ్ఛారణల మధ్య మంగళవాయిద్యాలతో నూతన విగ్రహప్రతిష్ఠ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, అట్లూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం ఆలయకమిటీవారు వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అన్నదాన కర్యక్రమాలు నిర్వహించారు.

గంగనపల్లె వద్ద 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కాశినాయన నవంబరు27(ఆంధ్రజ్యోతి) గంగనపల్లె చెరువుకు తెలుగంగ ఎడమకాలువ నీటిని ఎత్తిపోసే కార్యక్రమానికి సంబంధించి తెలుగంగ కాలువ వద్ద గురువారం 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు బద్వేల్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బి.రవీంద్రారెడ్డి తెలిపారు. బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి కె.రితేష్‌రెడ్డి ఆదేశాలతో గంగనపల్లె రైతులకు సాగు తాగునీటి కోసం చెరువులో నీరు నింపేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి మోటార్లు ఆన్‌చేసి నీటిని చెరువుకు ఎత్తిపోసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గంతంలో ఇక్కడ గ్రామస్థులు కలిసి చెరువుకు నీటిని ఎత్తిపోసేందుకు ప్రత్యేకంగా పైప్‌లైన్‌లు మోటార్లు ఏర్పాటు చేసుకొన్నారు. కొత్తట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 50 కుటుంబాలు చేరిక



మంగనపల్లెలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారు

పోరుమామిళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మండలంలోని మంగనపల్లె గ్రామంలో వైసీపీ నుంచి 50 కుటుంబాల వారు గురువారం టీడీపీ యువనేత రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి టీడీపీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. మంగనపల్లె గ్రామంలోని ఓసీలు, బీసీలు టీడీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, సహకార సంఘం ఛైర్మన్ కల్లూరు వెంకటక్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు కొండా రామక్రిష్ణరెడ్డి, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, సెట్టెం ప్రతాప్ సీతా వెంకటసుబ్బయ్యతో పాటు కటసుబ్బయ్యతో పాటు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్, ప్రధాన కార్యదర్శి పి.మహేష్‌బాబులు పేర్కొన్నారు. గురువారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థికబకాయిలను చెల్లించకుండా వేదింపులకు గురిచేసిందని రివర్స్ పీఆర్‌సీని అమలు చేసి వారిని దగా చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చిందని అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రాయాలనడం తగదని, దీనిపై ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవీంద్రుడు, పట్టణాధ్యక్షుడు గంగాధర్, రూరల్ అధ్యక్షుడు ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సహకరించడంలేదు

జమ్మలమడుగు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాల కోసం ఈనెల 30వ తేదీలోపు మ్యాపింగ్ నమోదు చేసుకోవాలని గడువు ఇచ్చినా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సహకరించడంలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. గురువారం వారు . జమ్మలమడుగులో విలేకర్ల ఎదుట సమస్యలను ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో అధికారులకు గృహ నిర్మాణం చేయుటకు అర్హులైన ప్రజలను మ్యాపింగ్ చేయాలని చెప్పడం జరిగిందని తెలిపారు. ఇళ్లు లేని పేదలు స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము సచివాలయాల వద్ద ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సెక్రటరీల వద్దకు వెళ్లినా స్పందించడంలేదని వాపోయారు. జమ్మలమడుగులోని సచివాలయ సంబందిత సిబ్బంది పేర్లు నమోదు చేయాలేదని వాపోయారు. ఈనెల 30వ తేదీలోపు నమోదు చేసుకోవాలని గడువు పెట్టారని అధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యకు సంబంధించి జమ్మలమడుగు ఎంపీడీవో సైదున్నీసాను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అన్ని సచివాలయాల్లో సిబ్బందికి సమస్యలు తెలిపి చర్యలు తీసుకుంటామని, పేర్లు నమోదు చేయిస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీఐ భాస్కర్‌రెడ్డి

మైలవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు రూరల్ సీఐ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిదిలోని కర్మలవారిపల్లె గ్రామంలో దొమ్మరనంద్యాల జడ్పీ హైస్కూలులో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులపట్ల అనుమానం కలిగితే వెంటనే 100, 112కు నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్ పుల్లారెడ్డి, ఎస్ఎం నరసమ్మ, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

కాశినాయనలో: విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని పోరుమామిళ్ల సీఐ హేమసుందర్‌రావు పేర్కొన్నారు. గురువారం వరికుంట్ల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. జిల్లా ఎస్పీ ఆదేశామేరకు మహిళల భద్రతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.మహిళలకు ఏమైనా అవాంతరాలు ఎదురైతే 112,100 నెంబర్లకు డైల్ చేయాలని చూచించారు. నర్సాపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి మహిళా పోలీసులతో సమావేశమై విద్యార్థినీల భద్రతపై పలు సూచనలు చేశారు.అనంతరం ఎస్ఐ యోగేంద్రతో కలిసి కాశినాయన జ్యోతీక్షేత్రాన్ని సందర్శించి వచ్చే నెల 4,5 తేదీల్లో జరిగే ఆరాధనపై భద్రతకు సంబంధించి ఆలయ నిర్వాహకులతో చర్చించారు.

అన్నదాత ఆనందమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● రైతన్నా.. మీకోసంలో భూపేష్‌రెడ్డి



మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి.

ముద్దనూరు/ఎర్రగుంట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నదాత ఆనందమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు మండలాల్లో గురువారం జరిగిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ముద్దనూరు మండల పరిధి మంగపట్నం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం దృష్టి లో పెట్టుకొని అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. సాగును లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ పంచ సూత్రాలను తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహనరెడ్డి, ఏవో వెంకటకృష్ణారెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణవేణి, ఎర్రగుంట్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ నాగరాజు, కొండాపురం మండల ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎర్రగుంట్ల మండలంలోని మాలేపాడు, పాత, కొత్త గోపులాపురం గ్రామంలో ఇంటింటికి తిరిగి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మేకల మోహన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటరమణయ్య, వ్యవసాయాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురంలో: రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం ధ్యేయమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బెడుదూరు, బురుజుపల్లె గ్రామాలలో గురువారం నిర్వహించిన రైతన్నా..మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు ప్రభుత్వం రూ.20,000 అందజేస్తోందన్నారు. ఏపీఏఐఎమ్ఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని, దాని ద్వారా రైతులకు కావాల్సిన సమగ్ర సమాచారాన్ని పొందవచ్చని ఏడీఏ రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నాగరాజు, ఏవో ఏపీ రామాంజులరెడ్డి ఎంపీడీవో నాగప్రసాద్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

800 మంది రైతులకు యాప్ డౌన్‌లోడ్

పోరుమామిళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ, రైతన్నా.. మీకోసంలో భాగంగా గురువారం మంగనపల్లెలో బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి యాప్‌లో 800 మంది రైతుల పేర్లను నమోదు చేయించారు. మండ లంలో గురువారం రైతులను యాప్‌లో అప్‌లోడు చేయించినట్లు ఏడీఏ మురళీధర్‌రెడ్డి, ఏవో చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న అధికారులు

చాపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. అల్లాడుపల్లె గ్రామంలో గురువారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆదిశేషారెడ్డి ఎంపీడీవో వీరకిశోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నేల, పండిన పంటలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. మారుతున్న కాలానికి అనుకూలంగా నూతన టెక్నాలజీతో వ్యవసాయం చేయాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకింద రైతులకు పూర్తిగా ఉచితంగా పండ్ల మొక్కలు పెంచుకునేందుకు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్, పంట మార్పిడి, నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలను గురించి అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏవో దేవీ పద్మలత, వీఏఏ విమత, గ్రామ కార్యదర్శి లక్ష్మీప్రసన్న, వీఆర్వో రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్



మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్

ప్రొద్దుటూరు , నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీసీల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు సెలూన్ షాపులకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తుందన్నారు. దేవాలయాల్లో పని చేసే నాయీబ్రాహ్మణులకు రూ.20 వేల నుంచి రూ. 25వేల గౌరవ వేతనం పెంచడం జరి గిందన్నారు. కూటమి ప్రభుత్వం పదేళ్ల పాటు కొనసాగేలా బీసీలంతా పనిచేయాలన్నారు. సమావేశంలో టీడీపీ బీసీ నేతలు గోవిందపల్లె క్రిష్ణయ్య, సోమా తిరుమలనాథ్, సుంకర మురళీ, బద్వేలు బాబులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేకుండా అందరినీ సమానంగా చూడాలి



శిక్షణకు హాజరైన డ్వాక్రా మహిళలు గ్రామ ప్రజలు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్షత లేకుండా సమాజంలో స్త్రీ, పురుషులను సమానంగా చూడాలని సీఎస్ఏ స్టేట్ కోఆర్డినేటరు ఆదినారాయణ, రిసోర్స్ పర్సన్ హేమలత పేర్కొన్నారు. బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట మైక్రోల్యాండ్ స్కేప్ సబల్‌ప్రాజెక్టు ఆధ్వర్యంలో వాంపల్లెచెరువు గ్రామంలో లింగ అసమానతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి బి.మఠం మండల మహిళా సమాఖ్యలో గ్రామ సమాఖ్యలు స్వయంగా సహాయక సంఘం సభ్యులు, గ్రామంలోని పురుషులు, మహిళలు, యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ఏ స్టేట్ కోఆర్డినేటరు ఆదినారాయణ, రిసోర్స్ పర్సన్ హేమలత మాట్లాడుతూ మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. యువత సమస్యలు వచ్చినపుడు ఆలోచించి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఈఎస్ సంస్థ కో ఆరిక్డనేటరు, క్లస్టరు కోఆర్డి నేటరు మహేశ్, గ్రామ సంఘం అసిస్టెంట్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.


అబ్బాయిలకు దీటుగా అమ్మాయిలను పెంచాలి



జండర్ సమానత్వంపై ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మైదుకూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అబ్బాయిలకు దీటుగా అమ్మాయిలను పెంచాలని ఎంపీడీవో శ్రీదర్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జండర్ సమానత్వం అనే కార్యకమాన్ని అధికారులు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రమణారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆడపిల్లలు సెల్‌ఫోన్ మోజులో పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో యస్ఐ సుబ్బారావు,జయరాజు,తదితరులు పాల్గొన్నారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘనంగా క్రీడాపోటీలు



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసిన నిర్వాహకులు

మైదుకూరు నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ పోటీలను బ్రాంచి, జోనల్, రాష్ట్ర స్థాయిలలో జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్ రావు స్మారకార్థం క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు మెడల్స్‌తో పాటు ప్రశంశాపత్రాలు అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.